క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ


మావుళ్లమ్మకు బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్):భీమవరం పట్టణంలో మావుళ్లమ్మ అమ్మవారి స్వర్ణ వస్త్రంనిధికి హైదరాబాద్‌కి చెందిన టీఎస్‌జీపీఎస్ ఎస్టేట్ లిమిటెడ్స్ టి.అమరలింగేశ్వరరావు దంపతులు 19.600 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ఉప ప్రధానఅర్చకులు ఆధ్వర్యంలో పూజలు ఆశీర్వచనలు నిర్వహించి శేషవస్త్రం సత్కరించారు.

అనాథ మృతదేహం ఖననం

భీమవరం: భీమవరం వన్ టౌన్‌లోని జంక్షన్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్‌పాత్ దగ్గర గురువారం మృతి చెందిన యాచకురాలుని అనాథగా గుర్తించిన భీమవరం వన్ టౌన్ పోలీసులు మానవతా సంస్థ భీమవరం శాఖను కోరడంతో ఆమె మృతదేహాన్ని ఖననం చేయడం జరిగిందని సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అల్లు శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

పడవల పోటీలో విష్ణు కళాశాల విద్యార్థుల ప్రతిభ


విష్ణు విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: కర్నూల్ జిల్లా గార్గేయపురం నాగరవరం చెరువులో ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించిన కయాకింగ్(పడవల) పోటీల్లో భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు చెప్పారు. పోటీల్లో పాల్గొన్న ఎస్ ఎస్‌వీ శ్రీకాంత్, కె మనోజ్, ఎం సాయి, సీహెచ్ మోసెస్, ఎస్ జగదీష్, జి మనివర్ధన్‌లను గురువారం కళాశాలలో అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి కళాశాలకు వన్నెతెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీలక్ష్మి, కోచ్ కె తిరుపతి పాల్గొన్నారు.

సీజేఐపై దాడి సరికాదు


జీ సుందర్‌కుమార్

ఉండి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జీ.సుందర్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దాడిని ఖండిస్తూ భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు 8,9 తేదీల్లో విధులకు హాజరు కాకుండా నిరసన తెలిపామని ఆయన పేర్కొన్నారు.

బంగారయ్యకు సత్కారం


వృద్ధుల సంఘం అధ్యక్షుడు బంగారయ్యను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి.

ఆకివీడు: వృద్ధుల సంక్షేమానికి విశిష్ట సేవలందిస్తున్న వృద్ధుల సంఘ అధ్యక్షుడు, వినియోగదారుల సంఘ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్యను గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సన్మానించారు. భీమవరంలోని కృష్ణదేవరాయ కల్యాణమండపంలో జిల్లా వృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులకు సేవలు చేయడం పూర్వజన్మసుకృతమన్నారు. తల్లిదండ్రుల్ని దైవంలా కొలిచి ఆదరించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోటేశ్వరరావు బాబును సత్కరించారు.

25లోపు పంట నమోదు చేయించుకోవాలి

యలమంచిలి: వరి సాగు చేసే రైతులందరూ ఈ పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు కోరారు. ఈ పంట సూపర్ చెక్ రికార్డుల సామాజిక తనిఖీ నిమిత్తం గురువారం ఆయన ఇలపకుర్రు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ పంట నమోదైతేనే ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరుతుందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 2,11,975 ఎకరాలు వరి సాగుచేయగా, ఇప్పటి వరకు 2,08,529 ఎకరాలు ఈ పంట నమోదయినట్టు చెప్పారు. మిగిలిన వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులందరూ అక్టోబర్ 25లోపు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దుంగా బాలాత్రిపుర సుందరి, గ్రామ రెవెన్యూ అధికారి టి.శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.రాజశేఖర్ తదితర రైతులు పాల్గొన్నారు.

పల్లె దారుల్లో అవరోధాలు

- నాణ్యతలేని పనులతో ప్రజలకు ఇక్కట్లు
- ఆందోళన కలిగిస్తున్న ఉండి, కోపల్లెరోడ్డు
- ఒకవైపు బొండాడ డ్రెయిన్‌లోకి కుంగిపోతున్న రోడ్డు
- గత జనవరిలో రూ.30 లక్షలతో చేపట్టిన మరమ్మతులు



ఉండి,కోపల్లె రహదారి అధ్వాన్నంగా మారిన దృశ్యం.

ఉండి: ఒకవైపు నాణ్యతలేని పనులు, మరోవైపు బొండాడ మేజర్ డ్రెయిన్‌లోకి కుంగిపోతూ ఉండి, కోపల్లె రోడ్డు పలు గ్రామాల ప్రజలను, వాహనదారులు ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తుంది. నియోజకవర్గ కేంద్రం ఉండి నుంచి బొండాడ మేజర్ డ్రెయిన్ గట్టుపై నుంచి కాళ్ళ మండలం కోపల్లె వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి సుమారు 7కి.మీ. పొడవునా ఉంది. అయితే ప్రస్తుతం ఈ రోడ్డు వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. దానికి కారణం రోడ్డు పొడవునా కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా వాండ్రం గ్రామ పరిధిలో బొండాడ మేజర్ డ్రెయిన్‌లోకి రోడ్డు కుంగిపోతుంది. ఎప్పుడు ఏం జరుగుతుందో అని వాహనదారులు అల్లాడిపోతున్నారు. ఎందుకంటే ఈ రోడ్డులో ఆక్వాచెరువులు, పరిశ్రమలకు సంబంధించిన భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు మరింతగా ఛిద్రంగా తయారైంది. ఇప్పటికే రోడ్డుకు ఒకవైపుగా పలు ప్రాంతాల్లో రోడ్డు కుంగిపోవడంతో ప్రమాదం అంచున వాహనడ్రైవర్‌లు వాహనాలు నడుపుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాలు ప్రయాణించే రోడ్డు అధ్వాన్న స్థితికి చేరడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని వాహనదారులు, ప్రయాణికులు భయపడుతున్నారు.

నాణ్యతకు తిలోధకాలు...

నాణ్యత లేకుండా చేపట్టిన రిపేరు పనులు కూడా రోడ్డు దుస్థితికి కారణంగా కనిపిస్తున్నాయంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది ప్రథమార్ధంలో రూ.30 లక్షల నిధులతో రోడ్డు రిపేరు పనులు చేపట్టారు. అయితే అవి నాశిరకంగా ఉండటంతో కురిసిన కొద్దిపాటి వర్షాలకు రిపేరు పనులు కాస్త కొట్టుకుపోయాయి. దీంతో రోడ్డు గతంలో కంటే ఇప్పుడు మరింత దుర్భరంగా మారింది. దీనివల్ల ప్రజల సొమ్ము బొండాడ డ్రెయిన్‌లో కలసిపోయిందంటూ పలువురు ఛలోక్తులుగా చెప్పుకుంటున్నారు. ఉండి మండలం నుంచి కాళ్ళ మండలానికి, కాళ్ళ మండలం నుంచి ఉండి మండలానికి ఆక్వాచెరువులకు మధ్యస్థ రహదారిగా ఈ రహదారి నిలవడంతో ప్రతీ నిత్యం భారీ వాహనాల్లో ఆక్వాచెరువులకు మేతలు, ఆక్వా ఉత్పత్తులను తరలిస్తుంటారు. కానీ రానురాను రోడ్డు ఇబ్బందికరంగా మారుతుండటంతో పలువురు ఆక్వా రైతులు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అలాగే ఈ రోడ్డులో మధ్యస్థంగా ఉన్న గ్రామం వాండ్రం నుండి స్కూల్ విద్యార్థులు నిత్యం ఈ రోడ్డులోనే ప్రయాణించి కోపల్లె హైస్కూల్‌కు వెళ్లాల్సి ఉంది. వర్షం పడిన ప్రతీసారి విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని రోడ్డు పరిస్థితిని పరిశీలించి కనీసం రిపేరు పనులైనా చేపడితే రైతులు, ప్రజలు, విద్యార్థులు కొద్దిరోజులైనా క్షేమంగా ప్రయాణాలు సాగిస్తారని వారు కోరుతున్నారు.

రోడ్డును పరిశీలించి రిపేర్లు చేపట్టాలి



ఉండి, కోపల్లె రోడ్డు పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారిపోతుంది. సంబంధిత అధికారులు వెంటనే రోడ్డును పరిశీలించి కనీసం రిపేరు పనులైనా చేపట్టాలి. లేకుంటే వాహనదారులు ఇబ్బందులు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయి. అలాగే రైతులు ఆక్వాఉత్పత్తులను తరలించేందుకు, చాలా ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు వెంటనే స్పందించాలి.

-పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు,ఎంపీటీసీ,వాండ్రం

తక్షణం స్పందించాలి



ఉండి, కోపల్లె రోడ్డు(వాండ్రం రోడ్డు) పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రయాణికులు, వాహనదారులు, రైతుల పరిస్థితిని గమనించి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రమాదమో లేక నష్టమో జరిగిన తరువాత చర్యలు తీసుకుంటే ఎటువంటి ప్రయోజనం ఉండదు. కనుక అధికారులు తక్షణం స్పందిస్తారని అనుకుంటున్నాను. ఇలా ఐతే ప్రయాణాలు సాగేదెలా?గమ్యం చేరేదెలా?

-గలావిల్లి ధనుంజయ, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు, ఎన్నార్పీ అగ్రహారం

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం..కొవ్వాడ పుంత గ్రామానికి చెందిన బలగం ఆంజనేయులు గత నెల సెప్టెంబర్ 28న ఇంటి వద్ద నుంచి పాలు, ఖైనా ప్యాకెట్లు తీసుకువస్తానని ఇంటి వద్ద నుంచి వెళ్లి ఇప్పటి వరకు రాలేదని బంధువులు, స్నేహితుల వద్ద వెతికిన ప్రయోజనం లేకపోవడంతో, గతంతో ఆంజనేయులు నాలుగుసార్లు ఇంటి వద్ద నుంచి వెళ్లపోయి 3 రోజుల్లో వచ్చే వారని ఇప్పుడు ఇంకా రాలేదని భార్య బలగం పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.లక్ష్మి నారాయణ

భీమవరం: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం నిమిత్తం భీమవరంలో ఉన్న అన్ని కోర్టుల్లో డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవాలని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మినారాయణ అన్నారు. గురువారం పత్రికా విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల వరకూ తీసుకువెళ్లడంలో ప్రింట్, ఎల్రక్టానిక్ మీడియా భాగస్వామ్యం అవసరమన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ నెల 18న అసంఘటిత కార్మికులు, బాలల కొరకు ప్రవేశ పెట్టిన పథకాలపై అవగాహన కల్పించుటకు ఒక న్యాయ సేవా సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని, రెవిన్యూ శాఖ, డీఆర్‌డీఏ, లేబర్ డిపార్ట్ మెంట్ , మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, పోలీస్, మునిసిపల్ శాఖల అధికారులు ఈ సదస్సులో భాగమవుతారని, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎ.సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీష, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గోదాము తనిఖీ


ఆకివీడు: అజ్జమూరులోని దీపావళి మందుల దుఖాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్

ఆకివీడు: దీపావళి బాణ సంచా విక్రయాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని అజ్జమూరు ప్రాంతంలోనూ, స్థానిక హోల్‌సేల్ , రిటైల్ వ్యాపార కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం అజ్జమూరు హోల్‌సేల్ బాణసంచా దుఖాణాన్ని తనిఖీ చేశారు. దుఖాణాల వద్ద నీటి బకెట్లు, డ్రమ్ములు, ఇసుక బాక్సులు ఉంచాలన్నారు. ప్రమాదం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనల్ని దుఖాణాదారులు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ హనుమంతు నాగరాజు, అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఫరూక్, ఆర్.ఐ ఆంజనేయులు ఉన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనురాధను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, ప్రణాళికాపద్ధతిలో విద్యనభ్యసిస్తే మంచిఫలితాలు సాధించవచ్చునని భీమవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొండా రాంబాబు అన్నారు. గురువారం భీమవరం పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ బి శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎ అనురాధను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్పర్సన్ నడింపల్లి మహేష్, కార్యదర్శి తులసీప్రసాద్, కోశాధికారి విజయరామకృష్ణ, ప్రాజెక్ట్ చైర్మన్ మధుబాబు, నందమూరి రాజేష్, మహ్మద్ సరోజని, పావిరాల రామమోహన్‌రావు పాల్గొన్నారు.

కంటికి సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అనాకోడేరు హైస్కూల్లో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: కళ్లకు సోకే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ నేత్ర వైద్యుడు బద్దె రామకృష్ణ అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరు గ్రామంలోని డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దృష్టి లోప నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లవానితిప్ప పీహెచ్‌సీ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యులు రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మెల్ల కన్ను, పుట్టుకతోనే వచ్చే కంటి శుక్లాలు, రేచీకటి, తదితర వ్యాధులు వస్తాయని ఆ వ్యాధులను ముందుగానే కంటి చికిత్సలు ద్వారా వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఈ నేత్ర వైద్య శిబిరంలో 285 మందికి పరీక్షలు చేయగా 30 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారించారు. కొంతమందికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎమ్ పి. కుమారి, ఎమ్ఎల్ హెచ్‌పీ ఎమ్ షాలిన్ రాజు, ప్రధానోపాధ్యాయులు సూర్యభగవాన్ రాజు, ఉపాధ్యాయులు బి. వనజ, బి. జోత్స్న, కె. రాజేష్ కుమార్‌రాజు, ఎమ్ బాల పల్లాలరాజు, ఆశా కార్యకర్తలు, ఎస్. కుమారి, జి. వెంకటలక్ష్మి, వి. నిరూప తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి చర్యలు


బొండాడలో అమ్మవార్ల ఆలయం వద్ద పెద్దలతో చర్చిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్ల మండలం బొండాడ గ్రామంలో గ్రామ దేవతలు శ్రీపోలేరమ్మ, శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ పునఃనిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ మన్నే నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక పెద్దలతో కలిసి ఆలయానికి కావాల్సిన స్థలాన్ని గుర్తించి సర్వే చేపట్టారు. ఆలయం రోడ్డు మధ్యలో ఉండి, పూర్తిగా పల్లపు ప్రాంతంలో ఉండి శిథిలావస్థకు చేరిందన్నారు. బొండాడ, బొండాడ పేట, బొండాడ లంక గ్రామ దేవతలుగా ఉన్న అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు పెద్దలతో సహకారంతో నిర్మిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ మన్నే శ్రీనివాస్, మన్నే సోమేశ్వరరావు, కందుల రాము, కొల్లెంపూడి వెంకన్న, బొండాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎన్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాలలో గురువారం మేరా యువ భారత్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, కళాశాల స్పోర్ట్స్ డిపార్టుమెంటు, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ని నిర్వహించారు. విద్యార్థులకు రన్నింగ్, కబడ్డీ, జావలిన్ త్రో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతపల్లి కనకారావు, నెహ్రూ యువ కేంద్ర యూత్ కోఆర్డినేటర్ కోసూరి రాజేష్, వైస్ ప్రిన్సిపాళ్లు కేఎస్‌వీ రంగారావు, బి.వెంకట రత్నం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్‌ఆర్డీ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ చినిమిల్లి శ్రీనివాస్, తెలుగు విభాగాధిపతి ఎస్ యాకోబ్, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ కోపల్లె నాగభూషణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

పెనుగొండ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మేరా యువభారత్‌ల ఆధ్వర్యంలో పెనుమంట్ర బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలల ప్రాంగాణంలో నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, షాట్‌పుట్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


ఆకివీడు: అజ్జమూరు ఎంపీపీ స్కూల్‌లో ప్రపంచ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: ఉత్తరాలు బట్వాడానే కాదు డిపాజిట్లకు భద్రత, బీమా సౌకర్యాల్ని తపాలా శాఖ అందిస్తుందని స్థానిక పోస్టుమాస్టర్ శ్రీనివాస మూర్తి చెప్పారు. మండలంలోని అజ్జమూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ప్రపంచ తపాల దినోత్సవంను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుకన్య, రికరింగ్ డిపాజిట్, పోస్టల్ ఖాతాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌వై.ఎస్.నారాయణ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ సమాచారాన్ని అందించేది ఉత్తరమేనన్నారు. ఉత్తరాల బట్వాడాను వేగవంతం చేయడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో సహోపాధ్యాయురాలు వర్ధిని, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రాజేశ్వరి, విద్యార్థులు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తపాలా వారోత్సవాలు


భీమవరం తపాల శాఖలో వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): తపాల శాఖలో అనేక సంక్షేమ పథకాలు ఉన్నాయని, ప్రజలకు చేరువలో పథకాలు అమలు జరుగుతున్నాయని భీమవరం డివిజనల్ పోస్టల్ సుపరింటెండెంట్ హరిప్రసాద్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాల శాఖ దినోత్సవ వారోత్సవాలను గురువారం భీమవరం హెడ్ పోస్టల్ కార్యాలయంలో ప్రారంభించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాల్లో చేతిరాతను చదువుతుంటే వాటిలో అవతలి వాళ్ల రూపం కనిపించేదని, అక్షరాలను తడిమితే వారి స్పర్శ తెలిసేదని, ఇప్పుడు ఫోన్లలో వీడియో కాల్ మాట్లాడుతున్నా ఆ ఆప్యాయత కనిపించడం లేదన్నారు. హెడ్ పోస్ట్‌మాస్టర్ పి రాజు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి తపాల శాఖ అమల్లో ఉందని, ప్రభుత్వ శాఖలో అతి కీలకమైన శాఖ తపాల శాఖ అని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు పోస్టల్ శాఖ సహకారంతో ఈ వారోత్సవాల్లో స్టాంపుల ప్రదర్శన, విద్యార్థులకు వివిధ పోటీలు, మొక్కలు నాటడం, పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తామని, గెలుపొందిన వారికి ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రమణ్యం, వబిలిశెట్టి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో వివిధ రకాల క్యాన్సర్‌లకు చెక్


కేవీకేలో చిరుధాన్యాలపై అంగన్‌వాడీలకు వివరిస్తున్న దృశ్యం

ఉండి: చిరుధాన్యాలతో అతిపెద్దరోగం క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు అని కేవీకే హోంసైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ దెబోరామెస్సియానా, కేవీకే హోంసైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ దెబోరామెస్సియానా తెలిపారు. ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో గురువారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని పురస్కరించుకుని చిరుధాన్యాలపై ఐసీడీఎస్ సిబ్బందికి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల ప్రయోజనాలు, వాటితో వండే వంటకాలపై ఐసీడీఎస్ సిబ్బందికి కేవీకే శాస్త్రవేత్తలు ప్రదర్శన, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ బిందు ప్రవీణ, డాక్టర్ వినయ లక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

11న ఆయుర్వేదంపై అవగాహన సదస్సు

భీమవరం (ప్రకాశంచౌక్): ఈనెల 11వ తేదీన భీమవరం చంద్రిక హోటల్ పక్కన చరక సంజీవిని కేరళ ఆయుర్వేద పంచకర్మ సెంటర్‌లో ఆరోగ్యంపై ఆయుర్వేద అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బి కృష్ణ చైతన్య తెలిపారు. మూల శంఖ (పైల్స్), రక్త మొలలు, మలమార్గంలో నొప్పి, మల బద్ధకం, ఫీస్టుల, ఫిషర్ వంటి సమస్యలకు ఆపరేషన్ లేకుండా క్షార సూత్ర ద్వారా చికిత్స అందిస్తామన్నారు. ప్రముఖ వైద్యులు డా యశ్వంత్ సాయి ఈ ఆరోగ్యంపై ఆయుర్వేద అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరానికి వస్తున్నారని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98855 59650 సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాయకుదురు విద్యార్థుల ప్రతిభ

వీరవాసరం: రాయకుదురు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి చదువుచున్న ఇద్దరు విద్యార్థినీలు వారధి పౌండేషన్ ద్వారా జిల్లా స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పుచ్చకాయల వెన్నెల వక్తృత్వ పోటీలో సోషల్ మీడియా ఈజ్ ఎ యూజ్ ఫుల్ టూల్ ఫర్ ది స్టూడెంట్ లెర్నింగ్ అనే అంశంపై మాట్లాడి జిల్లా స్థాయిలో ప్రథమస్థానాన్ని, వ్యాసరచన విభాగంలో దూది అంజలి వాట్ రోల్ షుడ్ స్కూల్స్ ప్లే ఇన్ ప్రమోటింగ్ మెంటల్ హెల్త్ అనే అంశంలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రథమ సహాయకులు కె. వీరాస్వామి, ఆర్. తులసీప్రదీప్, వి. శేఖర్, లక్ష్మి దుర్గ, హరిప్రియ, కె. వి.డి. ప్రసాద్, బి. రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

వీరవాసరం: వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొణితివాడ పీహెచ్‌సీలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి అప్పారావు, వైద్యాధికారి డాక్టర్ రాజేష్ , డానియల్ రాజు, పీవీ ప్రభాకరరావు, కొల్లి ప్రసాద్, ప్రైవేట్ మందులు షాపుల యజమానులు, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు కష్టాలపై ప్రభుత్వం మొసలి కన్నీరు


రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ ప్రభాకరరావు

భీమవరం: ఆరుగాలం శ్రమించి పండించిన టమాటాకు కనీస మద్దతు ధర కాదు కదా అగాధంలో కూరుకుపోయే పరిస్థితి ఉందని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు అన్నారు. ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి మొసలి కన్నీరు కారుస్తుందని ధ్వజమెత్తారు. భీమవరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం స్వయంగా ముఖ్య మంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో రైతుల వద్దకు వెళ్లే దమ్ము ఉందా అంటూ ప్రశ్నించారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చిత్తూరు జిల్లా పర్యటించాలని సవాల్ విసిరారు. రైతుల కష్టాలు తెలుసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. టమాటా రైతుల పంటలకు గిట్టుబాటు ధరను ప్రకటించాలని డిమాండు చేశారు.

దస్తావేజు పోయినది

దుంపల రమణకుమారి W/O. దుంపల నాగసటరాజు, కొత్తపేట రోడ్, D.No: 1-68 సిద్దాపురం, ఆకివీడు మండలం, ప.గో.జిల్లా, నాకు చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్ 1060/2015కు సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెంబర్ 4801/2013ను జిరాక్స్ తీయు నిమిత్తం నేను ది. 26-09-2025 నా ఇంటి వద్ద నుండి భీమవరం వెళ్ళుచుండగా మార్గమధ్యలో నా యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ 4801/2013 పెట్టిన కవర్ జారిపడిపోయినది. నేను మరల మార్గమధ్యలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఎంత వెదికినా నా యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ దొరకలేదు. దొరికిన వారు పై అడ్రస్‌లో అందజేయగలరు.

దుంపల రమణకుమారి W/o. దుంపల నాగసటరాజు
సెల్ : 80085 13126